# తుప్పు! తుప్పు!!

"హా ఆ ఆ ఆ ఛ్!"

పొద్దున్నే గడ్డం చేసుకుంటూ రాత్రి రాసిన కథలో ముగింపు నెమరేసుకుంటున్న సూపర్ రచయిత టీవీరావుకి ఆప్రకారంగా తుమ్మొచ్చింది. మనిషికి దేవుడిచ్చిన వరాల్లో బహుపసందయింది తుమ్ము. తుమ్మురాని వాడు మనిషే కాదు. తుమ్ము వల్ల ప్రత్యేకించి లాభాలూ వున్నాయి. తుమ్మేటప్పుడు మనస్సూ శరీరమూ ఏకాగ్రమై పోయి ఒక మహాను భూతి కలుగుతుంది. బ్రహ్మానందం ఇంతకన్నా గొప్పదేమీ కాదే. తుమ్మిన తర్వాత శరీరం తేలికవుతుంది. మనస్సు ప్రసన్నమవుతుంది. తుమ్ము తుఫాను లాంటిది. మన ఆరోగ్యం పెంచే టానిక్ లాంటిది.

అంచేత తన కథలో దయ్యాన్ని ప్రవేశపెట్టిన వైనంపై తనని తానే అభినందించుకుంటూ గడ్డం చేసుకుంటున్న టీవీరావు గట్టిగా తుమ్మి మంచిపనే చాశాడు. అయితే ఆశబ్దం విని వంటింట్లో వుల్లిపాయలు తరుగుతున్న శ్రీమతి లక్ష్మి పరిగెత్తుకొచ్చింది.

"ఎందుకలా గావుకేక పెడతారు? మెల్లగా పిలిస్తే రానా ఏమిటి?"

టీవీరావు తెల్లబోయి భార్యవంక అదోలా చూశాడు. ఇందులో ఆమె తప్పేమీ లేదు. అతని తుమ్ము 'లాక్-షీ-మీ!' అన్నట్టు ఓ మేరకి శ్రీమతి పేరుని అనుకరించడమే తప్పు.

శ్రీమతి మాటకు జవాబివ్వకుండా టీవీరావు సీరియస్‌గా అద్దంలో చూసుకోసాగాడు. షేవ్ చేసుకుంటూ తుమ్మటం చేత కుడిచెయ్యి పట్టుతప్పి రేజరు ముక్కుపక్కగా జారి పడబోయి కుడిమీసాన్ని ఊతం చేసుకుని ఆగిపోయింది. ఆ క్రమంలో మీసం ఒకపక్క రవ్వంత తెగిపోయింది భార్యాపిల్లల్ని ప్రేమించినట్టే మీసాన్నీ ప్రేమించే టీవీరావు బాధపడ్డాడు. దాన్నెలా సరిచెయ్యాలా అని ఆలోచిస్తుండగా ఎడమపక్క మీసం మీద ఎరుపూ నలుపు రంగుల కలయికతో ఒకానొక అపూర్వ పదార్థం కన్పించింది. పరీక్షగా దాన్ని ముట్టుకు చూశాడు. తుప్పులా వుంది. 'లా' వుండటమేమిటి? తుప్పే? టీవీరావు ఆశ్చర్యపడ్డాడు.

మీసాలు తుప్పుపట్టవని శాస్త్రం ఘోషిస్తోంది. రేజరూ పరిశుభ్రంగానే వుంది. మరెక్కణ్ణించి వచ్చినట్టు? ఒకవేళ తుమ్మినప్పుడు....? ఈ ఆలోచనతో కొంచెం దడ పుట్టినా టీవీరావు తేరుకుని నవ్వేశాడు. 'తనవెర్రి గాకపోతే తుమ్మినపుడు తుప్పెలా రాలుతుందీ? ఇది శాస్త్రానికి బొత్తిగా విరుద్ధం. అయినా మరోసారి తుమ్మి చూస్తే నష్టమేమిటి' అనుకున్నాడు. తుమ్మటానికి పూనుకున్నాడు. కళ్లు అరమూసి ముఖం వికృతంగా మార్చి ముక్కుపుటాల్నీ పెదాల్నీ అదోరకంగా కదిలిస్తూ విశ్వప్రయత్నం చేశాడు. లాభంలేకపోయింది. ఇలా కాదని ప్రయత్నపూర్వకంగా 'ఆక్చ్' అంటూ కృత్రిమ తుమ్ము తుమ్మాడు. ముక్కులోంచి అవాంఛనీయపదార్థమేదీ వెలువడ లేదు. టీవీరావు సంతృప్తిపడ్డాడు.

టీవీరావు కథలూ నవలలూ బాగానే పాఠకుల ఆదరణ పొందాయి. ఎప్పటి కప్పుడు కొత్తదనం అతని రచనల లక్షణం. రాత్రిరాసిన కథలో మరీకొత్తగా దయ్యాన్నే ఒక పాత్రగా చిత్రించడం పాఠకు లెంతవరకు ఆమోదిస్తారా అనుకుటూ అన్యమనస్కంగా స్నానపానాదులు పూర్తి చేశాడు. అలాగే భోజనం ముందు కూర్చున్నాడు. అతని మూడ్ని శ్రీమతి గ్రహించింది. టీవీరావు రచనలన్నా దాని తాలూకు మూడ్ అన్నా ఆమెకి తగని మంట. ఒకానొక సమయంలో తను తీవ్రమైన జ్వరంలో వుండగా అతను పట్టించుకోకుండా ఎక్కడో తన సన్మానానికి పరిగెత్తుకెళ్లినప్పటినుంచీ భర్త రచనా వ్యాసంగం పట్ల ఒక ద్వేషం ఆమెలో ప్రబలిపోయింది. ప్రస్తుతం చారు వడ్డిస్తూ ఒక అల్టిమేటం జారీ చేసింది.

"మూడోవాడికి పాలడబ్బా అయిపోయిందని మూడోసారి చెబుతున్నాను. మళ్లీ చెప్పను. వెంటనే బజారు కెళ్లి పట్టుకొస్తారో మీ మూడులోనే వుండి పోతారో మీ యిష్టం.

భోజనం ముగించి పాలడబ్బా తెచ్చియిచ్చి మళ్లీ గడపదాటగానే టీవీరావుకి మరో అపశకునం ఎదురైంది. ఆ అపశకునం పేరు కేశవయ్య. దగ్గర బంధువే, దూరం నుంచి వచ్చాడు. చిత్తూరు ప్రాంతం. ఆయన్ని లోపలి కాహ్వానించి కూర్చోబెట్టి కాజువల్గా కుశలం అడిగాడు టీవీరావు. లక్ష్మి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది.

"ఏమిటి పెదనాన్నా! విశేషాలు? కబురూ కాకర కాయలేకుండా హఠాత్తుగా వచ్చేశావే?"

"రాక తప్పలేదురా నాయనా!" అన్నాడు కేశవయ్య నిట్టూర్చుతూ. " కరువు సంగతి తెలుసుగా నీకు? పంటల్లేవు. తాగటానికి చుక్కనీరు దొరకటంలేదు. జనం వలసపోతున్నారు. పరిసరాల్ని కబేళాకి అమ్మేశా. మీ పెద్దమ్మనీ, పిల్లల్నీ పుట్టింటికి పంపించా. ఇక నేనా ఇక్కడే యేదైనా పని చేసుకుందామని వొచ్చాను."

టీవీ రావు జాలిపడ్డట్టు "చొచ్చొచ్చొ" అన్నాడు. లోలోపల మాత్రం అతని క్కడే వుండిపోతాడేమోనని భయపడ్డాడు. బంధువులంటే అతనికి ఎలర్జీ. వాళ్లు తన పేరు ప్రతిష్ఠలవల్ల లబ్ధి పొందటానికే వస్తారని అతనికి గట్టి నమ్మకం. అంతేగాక చుట్టాల రాకవల్ల

తన రచనా వ్యాసంగం దెబ్బతినటంకూడా అతని కిష్టముండదు. శ్రీమతి మాత్రం సానుభూతిగా మాట్లాడింది.

"నీకు పనిదొరికే దాకా ఇక్కడే వుండిపో మావయ్యా! ఏమంటారండీ?" అంది.

"ఊఁ వూఁ చేద్దాం చూద్దాం" అంటూ టీవీరావు గంభీరంగా ఆఫీసుకి వెళ్లిపోయాడు. భర్త వరస చూసి లక్ష్మికి మండుకొచ్చింది.

★ ★ ★

నాలుగురోజులు గడిచాయి కేశవయ్య కెక్కడాపని దొరకలేదు. అతని కైదైనా పని సంపాదించేందుకు తన పలుకుబడి నుపయోగించటం టీవీరావు కిష్టం లేకపోయింది. అదీగాక అతనికి పనిదొరికితే తనయింట్లోనే తిష్ఠవేసే ప్రమాదం వుందని సిక్త్ సెన్స్ వార్నింగిచ్చింది. శ్రీమతి అతనికి సకల మర్యాదలూ చెయ్యటం అతనుసహించలేకపోయాడు. ఏమైతేనేం టీవీరావు తన టెక్నిక్ నంతటినీ వుపయోగించి కేశవయ్యకి తన హృదయం అర్థమయ్యేట్టు చెయ్యగలిగాడు. కేశవయ్య చాలా విచారించాడు లోలోపల. చివరికి ఏదో నిర్ణయించుకుని లక్ష్మి వారించినా వినకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. అతనెందుకు వెళ్లిపోయాడో ఆమె తేలిగ్గానే గ్రహించింది.

"మనిషన్నాక మంచీచెడ్డావుండాలి. సాటిమనిషికి వుపయోగపడక పోయినప్పుడు సూపర్ రచయితవై ఏంలాభం?" అంది భర్తతో, 'సూపర్' అనే ముక్క మీద ఒక నొక్కు నొక్కుతూ.

"ఎంత సూపర్ రచయితైనా నీ ముందు బలాదూరే నోయ్!" అన్నాడు టీవీ రావు నవ్వుతూనూ, శ్రీమతి మాటల్లోని తీవ్రతని కొట్టి పడేస్తూనూ. అతను తనమీది విమర్శలనెప్పుడూ అలవోకగానే తీసు కున్నాడు. విమర్శల్ని సీరియస్‌గా పట్టించుకుంటే తను 'ఇంతటి' రచయితై వుండడని అతనికి తెలుసు. ఈ రోజున మూడు పత్రికల్లో అతని సీరియల్ నవలలు వస్తున్నాయి. మరో మూడు ఆఫర్లున్నాయి.

రచయితగా టీవీరావులో ఓ గొప్పలక్షణం వుంది. ఎవరితో మాట్లాడుతున్నా ఏపని చేస్తున్నా వాటిల్లోంచి ఓ కథా వస్తువు రాబట్టడానికి ప్రయత్నిస్తాడు. పత్రికలు చదువుతున్నప్పుడు – ముఖ్యంగా విదేశీ పత్రికలు – ఏ వింతలు విశేషాలు కన్పించినా వాటిని కత్తిరించి వర్గీకరించి వేర్వేరు ఫైళ్లు తయారు చేస్తాడు. అవసరమైనప్పుడు ఒక ఫైలు తెరిస్తే క్రైంనవలా, మరొకటి తెరిస్తే రొమాంటిక్ నవలా తయారవుతాయి. ఇలాంటి లక్షణం చేతనే టీవీరావు తనబంధువు రాక నుంచి మంచి 'కరువు కథావస్తువు'ను తయారు చేసుకోగలిగాడు. 'పోనీ ఓ కథ కరువు మీద రాద్దాం, వెరైటీగా కూడా వుంటుంది' అనుకున్నాడు.

కేశవయ్య వెళ్లిపోయిన సాయంకాలం టీవీరావుకి (మూడ్) వచ్చింది. అతని కళ్లముందు చిత్తూరు జిల్లా పటం ప్రత్యక్షమైంది. నెర్రెలు పడ్డ నేల ఆక్రోశిస్తున్నట్టు,

కబేళాకి తోలే పశువులు 'అంబా' అని అరుస్తున్నట్టు, జనం మంచినీళ్ల కోసం అలమటిస్తున్నట్టు రెటీనాపై ఎన్నో దారుణ దృశ్యాలు కదలాడ సాగాయి. ఆ వూపులో కేవలం గంటలో పన్నెండు పేజీల కథ తయారైంది.

కథ పూర్తవుతుండగానే అతని ఒకప్పటి క్లాస్‌మేట్ మూర్తి ఊడిపడ్డాడు. మూర్తి పట్నంలోని 'ప్రగతిశీల సమాఖ్య' అధ్యక్షుడు. మాటలమధ్యలో టీపాయ్ మీదున్న కథ అందుకున్నాడు. తనరచనలన్నీ నేరుగా పత్రికలద్వారానే పాఠకుల కందాలని టీవీరావు వుద్దేశ్యం. ప్రాథమిక దశలోనే ఎవరైనా చదివి సలహా లివ్వడం అతనికి గిట్టదు. అయినా మూర్తిని వారించలేక పోయాడు.

"ఇంతకీ నువ్వు చిత్తూరు ప్రాంతం ఎప్పుడెళ్లావు?" అని ప్రశ్నించాడు మూర్తి, కథ చదివీ చదవగానే. అతనీ మధ్యనే సమాఖ్య పక్షాన ఆ ప్రాంతం పరిస్థితిని పరిశీలించడం కోసం వెళ్లొచ్చాడు.

"వెళ్లక పోతేనేం? అక్కడి పరిస్థితుల్ని వూహించాను." అన్నాడు టీవీరావు స్థిమితంగా. కేశవయ్య సంగతి మాత్రం ఎత్తలేదు.

"కరువు మాటేమోగానీ నీ కథలో చిత్తూరు ప్రాంతం పంచరంగుల్లో కన్పిస్తోంది."

అది ప్రశంసో విమర్శో వెంటనే అర్థం కాలేదు టీవీరావుకి.

"అంటే?"

"ఏంలేదు. కథనిండా జాలిరసం పొంగిపొర్లుతూ వుంది. పాఠకులు చదివి రసానందం పొందవచ్చని ఢంకా బజాయించి చెబుతాను. అయితే నీ జాలికి వాస్తవాలతో పరిచయం వున్నట్టు లేదు. అంచేత కృత్రిమంగా వుంది. రచయితకీ రచనకీ మధ్య రక్త సంబంధం వుండాలి. ఏమంటావ్?"

" మా శ్రీమతి కంటే ఘోరంగా విమర్శిస్తున్నావు సుమా!" అన్నాడు టీవీ రావు అవిమర్శని తేలిగ్గా తీసుకోవటానికి ప్రయత్నిస్తూ.

మూర్తినవ్వాడు. "ఇక వెళ్తాను. ఇదుగో కరపత్రం. రాంగనర్ లో వరకట్న హత్య గురించి రేపు సాయంకాలం వూరేగింపు. నీకూ తెలియ జేద్దామని వచ్చాను."

టీవీరావు కరపత్రాన్ని పట్టించుకోలేదు. మూర్తి వెళ్లిపోయిన తర్వాత ఆలోచనలో పడ్డాడు.ఎంతమాటన్నాడు మూర్తి! తనరచనకీ తనకీ మధ్య రక్త సంబంధం లేదా? అసలు వాడి అభిప్రాయం ఎవడడిగాడు?.... అయినా అంత పనికిరాని కథ రాస్తాడా తనలాంటి రచయిత? ఇలా ఆలోచిస్తుండగా ఎందుకో కేశవయ్య పీక్కుపోయిన మొహం గుర్తొచ్చింది. అతని విషాద రూపాన్ని మనస్సులోంచి తుడిచెయ్యడానికి ప్రయత్నించాడు. తన ప్రవర్తననీ తన కథనీ సమర్థించుకోవడానికి పూనుకున్నాడు.

ఈ ఆలోచన్లతో సతమతమవుతుండగానే శరీరంలో ఏదో వుద్వేగం తన్నుకొస్తున్నట్టు తోచింది. అది మూడుకి సంబంధించింది కాదు. తుఫానుకీ తుమ్ముకీ ముందు మొదలయ్యే

సంక్షోభం. టీవీరావు ముఖకవళికల్లో వింతమార్పు వచ్చింది. కళ్లు అరమూసుకున్నాయి. పెదాలు వంకరతిరిగాయి. ముక్కుపుటాలు అదురుతూ గాలి కుదుపులు కుదుపులుగా శ్వాసకోశాల్లోకి పోయింది. మరుక్షణం ముక్కులోంచీ నోట్లోంచీ తుంపరతో కూడిన గాలి తుఫానులాగా దూసుకొచ్చింది.

"హాః ఆః ఆక్ఛూ!"

ఎదురుగా ఉన్నగోడమీద స్ప్రేపెయింట్ వేసినట్టు తుప్పు అంటుకుపోయింది. ఆ రాత్రి టీవీరావు కెలా నిద్రపట్టిందో మనకు తెలీదు.

★ ★ ★

"నేన్నమ్మను."

"మీరు నమ్మితీరాలి. ఇది నిజం డాక్టరుగారూ!"

"నిజమైతే కావచ్చు. కానీ ఇది సైన్సుకి బొత్తిగా విరుద్ధం. ఐకాంట్ బిలీవిట్."

"కానీ....."

"కానీ ఏమిటి? తుప్పుపట్టడం లోహధర్మం. పైగా ఎందుకూ పనికిరాని వస్తువులే తుప్పుపడతాయి. మరి మీరేమో మనుషులు. రచయితగా సమాజానికి పనికొస్తున్నారనే అనుకుంటున్నాను. అంచేత మీరు తుప్పుపట్టేందుకు వీల్లేదని గ్యారంటీ ఇవ్వగలను."

ఈ మాటలన్నది డాక్టర్ కేవీరావు. పట్నంలో ఎంతో ప్రసిద్ధి పొందిన డాక్టర్ ఆయన. ప్రిన్స్‌పుల్స్‌ని పాటించే వ్యక్తి. ప్రముఖ హేతువాది కూడా. ఒకానొక సాంస్కృతికసభలో టీవీరావూ, కేవీరావూ పరస్పరం పరిచయమై ఐదునిముషాల పాటు తమ భావాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అప్పట్నుంచీ ఆ పరిచయం గొర్రెతోకలా పెరుగుతూ వచ్చింది.

"ఇంతకీ మీరు నన్ను పరీక్షించనే లేదు." అన్నాడు టీవీరావు.

"దానికేం భాగ్యం? నిముషంలో తేల్చి పారేస్తాను."

కేసునెలా తీర్చిపారెయ్యాలో ఆలోచిస్తూ ఈజీఛైర్లో కళ్లుమూసుకుని సమాధిలోకి వెళ్లిపోయాడు డాక్టర్ కేవీరావు. టీవీరావు ఆందోళనగా అతనివంకే చూస్తుండిపోయాడు. కుర్చీలో చిన్నపిల్లాడు కూర్చున్నట్టుంది డాక్టర్ ఆకారం. మీసాలు పెంచుదామా గడ్డం పెంచుదామా అనే మీమాంసలో పడి చివరికి రెండూ తీసేసినట్టుంది అతని ముఖం. ముఖంలోని యితర భాగాల్ని ముక్కు తినేసింది. తలమీద తెల్లటోపీ దిగేసినట్టుంది జుట్టు. హఠాత్తుగా డాక్టర్ సమాధిలోంచి లేచి ఛైర్లోంచి కిందికి దూకాడు. స్టెతస్కోపు తీసుకుని టీవీరావు గుండెపరీక్షించసాగాడు. ఆశ్చర్యంతో అతని పిల్లికళ్లు పెద్దవయ్యాయి. టీవీరావు ఇక చూస్తూ భరించలేకపోయాడు.

"డాక్టర్‌గారూ! స్టెతస్కోపు చెవులకి తగిలించుకోవటం మర్చిపోయారు" అన్నాడు నెమ్మదిగా.

"ఐసీ" అని సీరియస్‌గా అనేసి స్టెతస్కోపు అవతల పడేసి "నాలిక చూపండి" అన్నాడు.

తర్వాత కళ్లు పరీక్షించాడు. బల్లమీద పడుకోబెట్టి పొట్ట ఒత్తిచూశాడు. చివరగా ముక్కు పరీక్షించాడు. ఏ రోగికైనా కేవీరావు ప్రాథమిక పరీక్ష యిలానే జరుగుతుంది. ఒకసారి మూలశంకరోగికి ముక్కుపరీక్షిస్తూ చివాట్లు తిన్నాడని వదంతి.

"అదీసంగతి" అని డాక్టర్ కేవీరావు తలవూపుతూ కుర్చీలో కూర్చుని మళ్లీ వైద్య సమాధిలోకి వెళ్లి పోయాడు. నిముషానికి కళ్లు తెరిచాడు.

"ఎక్స్టర్నల్ ఎగ్జామినేషన్‌లో నాకేడిఫెక్టూ కన్పించలేదు. యువార్ పర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్! అంటే మీరు నిక్షేపంగా గుండ్రాయిలా వున్నారు. అయినా మోషన్, యూరిన్ టెస్టులు చెయ్యకుండా ఫైనల్‌గా ఏం చెప్పడానికీ లేదు. ఈలోగా కొన్ని ప్రశ్నలడుగుతాను. సూటిగా సమాధానాలివ్వండి . మీరెప్పట్నుంచి తుమ్ముతున్నారు?"

"పుట్టినప్పట్నుంచీ తుమ్ముతూనే వున్నానని అనుమానం" అన్నాడు టీవీరావు వినయంగా.

"నో నో. ఈ ఎక్స్ట్రార్డినరీ తుమ్ములసంగతి నేనడిగేది."

"అదా? వారమైంది."

"ఈ వారంలో మీ డైట్‌లో గానీ, శరీర తత్వంలో గానీ ఏదైనా మార్పు జరిగిందా?"

"లేదు"

"పోనీ. ఆహారంలో ఐరన్ ఎక్కువగా వున్న అయిటమ్స్ - ఐ మీన్ - ఆకు కూరల్లాంటివి మితిమీరి తీసుకుంటారా?"

"అబ్బే. అవంటేనే నాకు ఎలర్జీ."

డాక్టర్ నిట్టూర్చాడు.

"ఒక్కదానికీ మీ నుంచి పాజిటివ్ ఆన్సర్ రాలేదు. ఒకవేళ యిదంతా మీ భ్రమేనేమో చూడండి. ఓసారి నలభైయేళ్ల మనిషి కడుపు నొప్పంటూ వచ్చింది. ఎన్ని టెస్టులు చేసినా కారణం కనబల్లేదు. చివరికి కనిపెట్టేశాను. ఆమె కడుపునొప్పికి కారణం ఏమిటనుకున్నారు? బొడ్లో తాళం చెవుల గుత్తి.!" అంటూ నవ్వినవ్వి ఆగాడు కేవీరావు. "ఎందుకైనా మంచిది. మరోపరీక్ష కూడా చేతాం. దీంతో తేలి పోవాలి." అని పైకిలేచాడు. అతనిముఖంలో దండయాత్రకి బయల్దేరిన నెపోలియన్ పట్టుదల కన్పిస్తోంది.

తనకెదురుగా టేబుల్ మీద టీవీరావుని కూర్చో బెట్టాడు. ముఖం ఏటవాలుగా నలభై ఐదు డిగ్రీల కోణంలో వుండేట్టు ఏర్పాటు చేశాడు.

"ఇప్పుడొక్కసారి తుమ్మిచూడండి. తేలిపోతుంది. ఆర్టిఫిషియల్ తుమ్మయినా ఒరిజనల్ తుమ్ములా వుండాలి. ప్రయత్నించండి. రెడీ. ఒన్, టూ, త్రీ!

"ఆక్ఛ్!"

"ఇంకా నేచురల్‌గా వుండాలి."

"ఈ ప్రయోగం ముందే చేశానండి."

"కావచ్చు. కానీ డాక్టర్ చూస్తుండగా చెయ్యలేదు. కానివ్వండి."

టీవీరావు ఉత్సాహంగా ప్రయత్నించాడు. మహోద్రేకంతో ప్రయత్నించాడు. భయంకరంగా ప్రయత్నించాడు. ముఖం వీలైనన్ని భంగిమల్లోకి తిప్పుతూ శరీరం మొత్తం కుదుపుతూ నానా అవస్థ పడ్డాడు. ఎంత ప్రయత్నించినా తుఫాన్ లాంటి ఒరిజనల్ తుమ్ము రానేలేదు. వచ్చిన కృత్రిమ తుమ్ముల్ని డాక్టర్ డిస్క్వాలిఫై చేశాడు. చివరికి టీవీరావు ఎగశ్వాసా దిగశ్వాసల్తో రొప్పుతూ వుండిపోయాడు. ఏ ఒక్క నవల రాయడానికీ అతనింతగా కష్టపడింది లేదు.

"ఇలా కాదుండండి." అని డాక్టర్ కన్సల్టింగ్ రూం చుట్టుపక్కల నర్సు సమేతుడై వెదికి సన్నని పుల్ల సంపాదించాడు.

"ఊ ఇలా ముఖం అదే కోణంలో వుంచికూర్చోండి. తుమ్మెలా రాదో చూస్తాను." డాక్టర్ కేవీరావు ఆ సన్నని పుల్లని బంగారంలా భద్రంగా పట్టుకుని ఆ యొక్క టీవీ రావు ఎడమనాసికా రంధ్రంలో దూర్చి కెలికాడు.

టీవీ రావు నాసికారంధ్రంలో తీవ్రసంక్షోభం మొదలైంది. తక్షణం రూమంతా అదిరి పోయేట్టు పెద్దపెట్టున ఒకే ఒక్క గంభీర తుమ్ము తుమ్మాడు.

"సక్సెస్! గ్రాండ్ సక్సెస్!" అన్నాడు కేవీరావు సంతోషంగా ముఖం మీద వాన జల్లులా పడ్డ తుంపర తుడుచుకుంటూ.

తర్వాత నేప్‌కిన్‌తో టీవీరావు మొహమూ ముక్కూ శుభ్రంగా తుడిచి నేప్‌కిన్‌ని శల్యపరీక్ష చేశాడు. ఎక్కడా తుప్పు జాడలులేవు. డాక్టర్ మొహం వికసించింది.

"నేముందే చెప్పలా? ఇదిసైన్సుకి బొత్తిగా విరుద్ధం."

టీవీరావు మొహం డాక్టర్ మొహం కంటే మరింతగా వికసించిందని వేరే చెప్పనక్కర్లేదు.

★ ★ ★

దరిమిలా టీవీరావు ద్విగుణీకృతమైన వుత్సాహంతో రచనా వ్యాసంగం కొనసాగించాడు. అంతకు ముందు మొదలెట్టిన నవల ఒకానొక ప్రముఖవారపత్రికలో ప్రచురింపబడసాగింది. టీవీరావు ఏనవలైనా మొత్తం రాసి పత్రికలకి పంపించడు. తన కున్న డిమాండును బట్టి పత్రికలవాళ్లు అంతకాలం ఓపికపట్టలేరు. కాబట్టి ఏ వారానికావారం దఫాల వారీగా ఒక్కో భాగం పంపుతాడు వేర్వేరు పత్రికలకి. ఈ పద్ధతి అతని కెంతో లాభించింది. మొత్తం కథగురించి ఒకేసారి తలబద్దలు కొట్టుకోకుండా వారం వారం తాజాగా ఆయాభాగాలు రాసుకుంటూ మలుపులు తిప్పుకుంటూ పోవచ్చు. పాఠకుల రెస్పాన్సుని బట్టీ, పత్రికల రెమ్యూనరేషన్‌ని బట్టీ మలుపులూ మసాలాలూ పెరుగుతాయి. ఇంతేగాక ఈ పద్ధతి బట్టి తర్వాతి సంచికలో కథెలా వుంటుందో పాఠకులకి చస్తే అంతుచిక్కదు.

ఎందుకంటే రచయితకే ముందస్తుగా ఆ భోగట్టా తెలీదు గదా! దీంతో కావాల్సినంత థ్రిల్! టీవీరావు రచనల్లో మజాయిదే!

ఆరోజు టీవీరావు ఆరుబయట కుర్చీ వేసుకుని అభిమానుల వుత్తరాలు చూస్తున్నాడు. ఆయన అభిమానుల్లో స్త్రీల సంఖ్యే ఎక్కువ. టీవీరావుకి స్త్రీ అభిమానులంటేనే ప్రత్యేకించి అభిమానం. వాళ్ల వుత్తరాలు చదవగానే ఆయన హృదయం స్పందిస్తుంది. ఆ స్పందనలోంచి ప్రత్యేక శ్రద్ధతో జవాబులు రాస్తాడు. వాటిలోతుల్లోకి పోవడం మనకేమంత మంచిదికాదు. అదలా వుంచితే ఆరోజు ఆయన అభిమానుల వుత్తరాలు తిలకిస్తున్న సందర్భంలో 'ప్రజామత' ఎడిటర్ నుండి ఫోనొచ్చింది.

టీవీరావు కొత్తసీరియల్ వస్తున్న పత్రికకీ ఈపత్రికకీ చుక్కెదురు. తనకి ముందుగా సీరియల్ పంపుతానని వాగ్దానం నచేసి టీవీరావు మరోపత్రిక సర్క్యులేషన్ పెంచడం ప్ర.మ. ఎడిటర్‌కి ఏ మాత్రం గిట్టలేదు. అంచేత ఆయన టీవీరావుకి పూర్వం ఏ పత్రికా యివ్వనంత పారితోషికం వాసన చూపి రెండువరాలు కోరాడు! ఒకటి, ఆ ఫలాన పత్రికలో వచ్చే సీరియల్‌ని హఠాత్తుగా పుట్టి ముంచడం. రెండోది, సరికొత్త ట్రెండుతో పాఠకుల్ని ఊపేసే సీరియల్ ప్ర.మ. పత్రికలో ప్రారంభించడం. టీవీరావు ఆలోచించాడు ఆఫలాని పత్రికతో కాగితం మీద అగ్రిమెంటు లేదు గాబట్టి నిలదీసేవాడు లేడు. పోతే ఆ ఫలాని పత్రికతో సంబంధాలు తెగినంత మాత్రాన తనకి ముంచుకు పోయిందేమీలేదు. ఈవిధంగా కలం వుండగానే భవిష్యత్తు చక్కదిద్దుకోవాలని టీవీరావు ఆశించడంలో విచిత్రం లేదు. కాబట్టే అతను తక్షణం ఆ ఫలాని పత్రిక సీరియల్‌లో మాంచి ఆరోగ్యంగా వున్న హీరోని నిర్దాక్షిణ్యంగా కలం పుచ్చుకు చంపేశాడు. ఆ రెండో వారంతో సీరియల్ ముగించాడు. ఆ ఫలానిపత్రిక సర్క్యులేషన్ దెబ్బతింది. ఎడిటర్ టీవీరావుని శాపనార్థాలు పెట్టాడు. ఇక టీవీరావు ప్ర.మ. పత్రిక కోసం తనకొత్త సీరియల్ ద్వారా ఒక సరికొత్త ట్రెండుని సాహిత్య లోకంలో ప్రవేశ పెట్టదలుచుకున్నాడు. అది హారర్ ట్రెండ్. ఒకానొక భయంకర హత్యతో, దానికి ముందొక మానభంగంతో ఆసీరియల్ మొదలయ్యింది. ఆ రెండు సంఘటనల తాలూకు సూక్ష్మమైన వివరాలను సైతం టీవీరావు వర్ణించక వదిలి పెట్టలేదు. అందువల్ల మసాలాతో కూడిన సహజత్వం వస్తుందని అతనికి తెలుసు. పాఠకుల నరాల్ని ఎక్కడ బిగబట్టాలో ఎక్కడ వదలాలో ఆ సూపర్ రచయితకి తెలియంది కాదు. ఆ విధంగా కథని బీభత్స సన్నివేశాలతో, అదృశ్య శక్తుల ప్రమేయంతో, చిత్ర విచిత్రమైన మలుపులతో కొనసాగించాడు టీవీరావు. ఆనవలలో యువతి భయానక మానభంగానికి ఆమె సోదరుడే కారణం కావడం చిట్టచివరి సెన్సేషన్! నెలరోజుల్లో నవల పూర్తయింది. నవల మొత్తం ఒకేసారి ఇవ్వాలని ప్ర.మ.పత్రిక ఎడిటర్ పెట్టిన షరతు! అలా 'ప్రజామత' లో సెన్సేషనల్ సీరియల్ ప్రారంభమైంది. ఆ ఎడిటర్ పంపిన బరువైన చెక్కు టీవీరావు స్థాయిని ఎన్నోమెట్లు పైకెక్కించింది. మహానందంతోనూ సగర్వంగానూ

ఆయన ఆ చెక్కుని శ్రీమతికి ప్రదర్శించాడు.

"చూశావా మన విలువ?" అని కళ్లెగరేస్తూ అడిగాడు.

లక్ష్మి మూతి మూడు వంకర్లు తిప్పింది.

"ఆ పక్క వీధి పార్వతికీ వుంది ఇంతోటి రేటు. అభిమానం పోయే కొద్దీ రేటు పెరుగుతుంది కాబోలు."

"పోదూ నీదంతా ఎగతాళి." అంటూ టీవీరావు అక్కడ నిలవకుండా తన గదిలోకి వెళ్లాడు. ఇంతలో మళ్లీ వెనకటి ఫలాని పత్రిక ఎడిటర్ ఫోన్ చేసి సీరియల్‌గా శాపనార్థాలు పెట్టాడు.

ఆ రాత్రి ఆ బరువైన చెక్కుని తలగడ కింద పెట్టుకుని సుఖనిద్ర తీద్దామని చూశాడు టీవీరావు. ఎందుకో శ్రీమతి మాటలు ముళ్లలా గుచ్చుకున్నాయి. "అయినా ఈ మాటలకేంలే? నా పేరు ప్రతిష్ఠలంటేనే గిట్టవు దీనికి' అనుకున్నాడు చివరకి. అప్పటికీ మనస్సు శాంతించలేదు. ఫోన్లో ఎడిటర్ తిట్లు గుర్తుకొచ్చాయి. సన్నగా ముక్కులో ఏదో జిలజిల మొదలైంది. 'కొంపదీసి తుమ్ములు రావుగదా!' అని భయపడ్డాడు. గబ, గబా నిద్రమాత్రలు మింగి పడుకున్నాడు.

మామూలుగా నిద్రలేవగానే టీవీరావు ఒక్కసారి నెమలి పురివిప్పినట్టు నోరు వీలైనంత విశాలంగా తెరిచి తృప్తిగా ఆవలిస్తాడు. ఆ కార్యక్రమం సజావుగా ముగిసిన తర్వాత మంచం దిగి శోభనం పెళ్లికూతుర్లా కళ్లు బరువుగా తాటిస్తూ ఎడమచేత్తో క్రాపు సరిచేసుకుంటాడు. ఆ పిమ్మట కుడిచేత్తో బ్రష్షు పుచ్చుకుని బాత్‌రూంకి ప్రయాణిస్తాడు. ఆ రోజూ అలాగే నిద్రలేవగానే యథాప్రకారం ఆవలించాడు. తర్వాత నిద్రమత్తులోనే బ్రష్ 'తీసుకుని' బాత్‌రూంలోకి అడుగుపెట్టాడు. తీరా పళ్లు తోముకుందామని ప్రయత్నించేసరికి బ్రష్షూ కన్పించలేదు. బ్రష్షు ఉండాల్సిన కుడి చెయ్యీ కన్పించలేదు. టీవీరావు మహాశ్చర్యంతో మళ్లీమళ్లీ చూసుకున్నాడు.ఊహూ. ఎడమచేత్తో వళ్లంతా తడుముకున్నాడు. ఊహూ. అనుమానంతో అద్దం ముందు నిలబడి శల్యపరీక్ష చేశాడు. ఊహూ. తన చుట్టూ తనే తిరిగి వళ్లంతా చూసుకున్నాడు. ఊహూ. బ్రష్షు పట్టాల్సిన చెయ్యి, ఫైలు తిప్పాల్సిన చెయ్యి, సీరియల్స్ రాయాల్సిన చెయ్యి అయిపూ అజా లేదు. గాయమూ లేదు. బాధాలేదు. పడుకున్న పక్కమీద మాత్రం ఇంతెత్తున తుప్పు రాలివుంది!

★ ★ ★

"ఇలాంటి కేసు నా జన్మలో చూళ్ళేదు" అనఆనడు డాక్టర్ కేవీరావు, చూడకపోవడం ఎంతో గొప్ప విషయం అన్నట్టు.

టీవీరావు మాట్లాడలేదు. అతను ప్రస్తుతం కేవీరావు హాస్పటల్‌లో ఇంటెన్సివ్ కేర్‌లో వున్నాడు. అతని మొహంలో విషాదం వుంది. అతని చుట్టూ బిక్కమొహాలతో భార్యాపిల్లలూ వున్నారు. టీవీరావు మాటిమాటికీ కళ్లు మూసి తెరుస్తూ పైన తిరిగే

ఫ్యాన్ వంక చూస్తున్నాడు. ఫ్యాన్ ఆకుల్లో అతనికి తనకుడి చెయ్యే కన్పిస్తోంది. చెయ్యేలేకపోతే తను రాయదల్చుకున్న నవలలన్నీ ఏమై పోవాలి? తన ఆశలూ ఆశయాలూ తద్వారా సమాజం ఏమై పోవాలి?

"తేల్చి పారేస్తాను" అన్నాడు డాక్టర్ వున్నట్టుండి.

డాక్టర్ కళ్లు అనూహ్యమైన కాంతితో వెలిగిపోతున్నాయి. అతనిలో మహోత్సాహమూ పట్టుదలా తొణికిసలాడుతున్నాయి. ఒకానొక అత్యద్భుతమైన, ప్రపంచం కనీవినీ ఎరగని, నూతనకేసును పరిష్కరించబోతున్నాననే వుత్సాహం అది. అతని వుత్సాహం చూసి టీవీరావు భార్యాపిల్లలూ కొంత వూరట చెందారు.

"అట్నుంచి నరుక్కొస్తాను" అన్నాడు డాక్టర్ మళ్లీ రౌద్రంగా. అతని కళ్లు ఎర్రబడ్డాయి. చరచరా పర్సనల్ రూంలోకి వెళ్లాడు. కేసుమీద కూర్చోవాలంటే ఆయన ముందుగా రివాల్వింగ్ ఛైర్లో కూర్చోవాలి.

ఈ లోగా టీవీరావుని చూడటానికి కొందరు అభిమానులూ, ఒక పత్రికాధిపతీ, మూర్తీ వచ్చారు. తక్కిన వాళ్లు వెళ్లిపోగా మూర్తి మిగిలాడు.

"ఏమిటో అన్నయ్యగారూ! ఈయన గారి పరిస్థితి నాకేమీ అంతుబట్టటం లేదు." అంది టీవీరావు భార్య.

మూర్తి అదోలా నవ్వాడు. టీవీరావు అతనికేసి సందేహంగా చూశాడు.

"ఏ ముందమ్మా? మనవాడి రచనల్లో మనుషులే అమాంతం మాయమవు తుంటారు. ఆఫ్టాల్ చెయ్యిమాయం కావడంలో వింతేముందీ? ఆ చెయ్యి ప్రజలకి వుపయోగపడటం లేదేమో మరి. రచనా వ్యాసంగం మానేస్తే సరి. అంతా అదే చక్కబడుతుంది." అన్నాడు మూర్తి.

"సరిగ్గా చెప్పారన్నయ్యగారూ! ఆయన రాసే వాటిమీద నాకెప్పుడో నమ్మకం పోయింది. రాతలూ చేతలూ తూర్పు పడమర లేమో ఆయనకే తెలియాలి". అంది శ్రీమతి లక్ష్మి.

ఈ మాటలన్నీ వింటున్న పేషెంటు టీవీరావు తనపై జరుగుతున్న కుట్రను సహించలేకపోయాడు.

"తూర్పు పడమర లేకమైనా సరే నా రచనా వ్యాసంగం మానేది లేదు. కుడిచెయ్యి పోతే ఎడమ చెయ్యిలేదా యేమిటి?" అన్నాడు దూకుడుగా.

మూర్తి మళ్లీ నవ్వటం చూసి టీవీరావుకి వళ్లు మండింది.

'నా పేరు ప్రతిష్ఠలు చూసి వీడికి ఈర్ష్య' అనుకున్నాడు. రచనలు మానేస్తే ఏమై పోవాలి? రచయితల్లో తనిప్పుడు అగ్రస్థానంలో వున్నాడు డిమాండ్ రీత్యా. దీన్ని పోగొట్టుకుంటే ఏముంది? ఇంతకీ తన ఆరోగ్యం చక్కబడుతుందా? కేవీరావు ఎంత సమర్థుడైనా పోయిన చెయ్యితిరిగి తీసుకు రాలేడు గదా? ఎడమ చేత్తో ఎప్పటికి కలం

పట్టేట్టు? ఈలోగా తక్కిన రచయితల తాకిడికి తను కనుమరుగైతే? అయినా ఇంత చైతన్యవంతుడైన తన అవయవాలు తుప్పుపట్టడమేమిటి కర్మగాకపోతే? ఇలాంటి ఆలోచన్లతో టీవీరావుకి నిద్ర కరువైంది.

తన భీషణ ప్రతిజ్ఞ ననుసరించి డాక్టర్ కేవీరావు టీవీరావు కేసు మీద కూర్చున్నాడు. అతనికి దేవుడి మీద నమ్మకం లేదు. అంచేత మనస్సులోనే తన కిష్టమైన హేతువాదాన్ని ధ్యానించుకొని రంగంలోకి దూకాడు. ముందుగా టీవీరావు బయోడేటా సేకరించాడు. తర్వాత టీవీరావు ఆ యొక్క స్పెషల్ తుమ్ము తుమ్మిన తేదీ నోట్ చేసుకున్నాడు. ఆ సందర్భంలో టీవీరావు ఏం చేస్తూ ఏం ఆలోచిస్తున్నదీ గుర్తుపెట్టుకున్నాడు. టీవీరావు అలవాట్లూ, ఆహార విధానమూ, అప్పుడప్పుడు వచ్చే మూడ్ తాలూకు వివరాలూ రాసుకున్నాడు. దొరికితే గుర్తించేందుకు వీలుగా అతని కుడిచెయ్యి రంగూ రూపు నోట్ చేసుకున్నాడు. చెయ్యి అదృశ్యమై పోగా మిగిలిన తుప్పు శాంపిల్‌గా రసాయనిక పరీక్షకి పంపాడు. పరీక్షలో అది నిఖార్సయిన తుప్పని తేలింది!

మనిషి శరీర నిర్మాణంలో ఇనప సరంజామా వుండే వీలులేదని కేవీరావుకి తెలుసు. ఒక వేళ అతనెప్పుడైనా పొరపాటున ఇనపవస్తువేదైన మింగాడా? టీవీరావుకి వెంటనే ఎక్స్-రే పరీక్ష జరిగింది. అనుమానించ దగ్గ ఆధారాలేవీ కన్పించలేదు. పోతే వస్తువులు నిరుపయోగంలో వున్నప్పుడే గదా తుప్పు పట్టేది? ఆ హేతువుతో ఆలోచిస్తే టీవీరావు అవయవాలన్నీ-ముఖ్యంగా కుడిచెయ్యి నిరంతర వుపయోగంలోనే వున్నాయి. కాకపోతే అతని ఆలోచనలూ రచనలూ సమాజానికి నిరుపయోగంగా తయారవుతుండొచ్చు. కానీ అందువల్ల టీవీరావు తుప్పుపట్టి పోతున్నాడా? భావరంగం భౌతిక రంగం మీద ప్రత్యక్ష ప్రభావం చూపలేదనే హేతువు మీద కేవీరావు ఆ విషయాన్ని అంగీకరించలేకపోయాడు.

చివరగా టీవీరావుకి రక్తపరీక్ష జరిగింది. ఆ పరీక్షలో డాక్టర్ కల్లో గూడా వూహించని అత్యద్భుత విషయం బయట పడింది. టీవీ రావు రక్తంలో ఎర్రకణాలు, తెల్లకణాలతోపాటు ఇంకేవో గుర్తు తెలీని నల్లకణాలు అసంఖ్యాకంగా వున్నాయి! వైద్యశాస్త్ర చరిత్రలోనే అపూర్వ విషయం అది. దానికి కారణమేమిటా అని కేవీరావు తల బద్దలు కొట్టుకున్నాడు. ఎన్నో వైద్య శాస్త్ర గ్రంథాలు రిఫర్ చేశాడు. సుప్రసిద్ధ వైద్యులతో చర్చించాడు. కానీ ఏవిధమైన ఆచూకీ దొరకలేదు.

కేవీరావు పట్టువదలని విక్రమార్కుడి వంశంలో పుట్టాడు. పదిరోజుల పాటు టీవీరావు బెడ్ పక్కనే పహరా కాశాడు. ఏ క్షణంలోనైనా టీవీరావు తుమ్మొచ్చు. తద్వారా ఆ వ్యాధి రహస్యం బయట పడొచ్చు. కానీ టీవీరావుకి తుమ్ములు రాలేదు. ఇలా కాదని టీవీరావుకి జలుబు చేసేందుకు కొన్ని ప్రత్యేక పద్ధతులుపయోగించాడు. అనుకున్నట్టు టీవీరావుకి జలుబు చేసింది. అయితే ముక్కు వెంట ధారాపాతంగా జలుబునీళ్లు కారుతున్నా డాక్టర్ ఆశించిన సహజతుమ్ము రానేలేదు. కనీసం సమీప భవిష్యత్తులో నైనా

తుమ్మొచ్చే సూచనలు కన్పించలేదు. డాక్టర్ నిరాశగా నిట్టూర్చాడు. తన ప్రతిజ్ఞ ఘోరంగా విఫలమైంది. చివరికి కేసు మీద నుంచి లేవక తప్పలేదు.

"మీ రక్తంలో ఏదో విపరీత లక్షణం జీర్ణించుకు పోయింది. అదే మీ విచిత్ర వ్యాధికి కారణమని నా నమ్మకం. అయితే అదేమిటో అంతుపట్టటం లేదు. ప్రస్తుతానికి మీరు డిశ్చార్జ్ కావచ్చు. అవసరమైతే కబురు చెయ్యండి. నాకెందుకో మీరు కొన్నాళ్ల పాటు రచనా వ్యాసంగం మానేస్తే మంచిదనిపిస్తోంది. మీరు రచనలు చెయ్యడానికీ మీ చెయ్యి అదృశ్యం కావడానికీ ఎక్కడో సంబంధం వుండి వుండాలి. అదేమిటో హేతువు కందడంలేదు" అని ముగించాడు డాక్టర్ కేవీరావు.

టీవీరావు పుట్టెడు దుఃఖంతో ఏమీ మాట్లాడలేక పోయాడు.

★ ★ ★

టీవీరావు నిత్యసంతోషి. అంచేత రోజులు గడిచి సులువుగానే దిగులు మర్చిపోగలిగాడు. చేతికన్నా ఖ్యాతి ముఖ్యం. అశేష ఆంధ్ర పాఠకుల అభిమానమే వెయ్యి చేతుల పెట్టు. ఇంతకు పూర్వం కుడి చేత్తో తను రాసిన బీభత్సభయానక సీరియల్ సూపర్ హిట్టయింది. 'ప్రజామత' పత్రిక సర్క్యులేషన్ పుంజుకుంది. ఆ వెంటనే ఎంతోమంది రచయితలు అదే ధోరణిలో నవలలు రాయసాగారు. కాబట్టి యిప్పుడతను ఎడమచేత్తో మరో కొత్త ట్రెండును సృష్టించాల్సి వచ్చింది. పత్రికలూ అదే కోరుతున్నాయి. కొన్ని రోజుల పాటు టీవీరావు తీవ్రంగా ఆలోచించాడు. ఆకర్షణీయమైన కొత్త ట్రెండ్ కోసం. విదేశీ పత్రికలూ, నవలలూ తిరగేశాడు. చివరికి ఒకానొక అద్భుతమైన దారి దొరికింది. ఇక రాత పనికోసం ఎడమ చేతికి కఠిన శిక్షణ యిచ్చాడు. అశేష పాఠకుల అదృష్టం బాగుండటం చేత టీవీరావు కుడిచేతికన్నా ఎడమచేతికే కలం పట్టు బాగా చిక్కింది. ఆ విధంగా ఆవిర్భవించింది 'వేస్టుపేపర్' అనే పరిశోధనాత్మక నవల. వేశ్యల జీవితాల గురించి కరుణ శృంగార రసాల సమ్మేళనంతో ఆ నవల రూపొందించాలని టీవీరావు ఉద్దేశ్యం. ఇందుకోసం కొందరు వేశ్యల్ని కలుసుకుంటే తనకీ పాఠకులక్కూడా థ్రిల్లింగ్‌గా వుంటుందనుకున్నాడు. ఆ కార్యక్రమం కొనసాగింది.

అదే సమయంలో జాతీయ స్థాయి నవలల పోటీ ప్రకటన ఒకటి చూశాడు టీవీరావు. బహుమతులూ ఆకర్షణీయంగా వున్నాయి. దీన్లో బహుమతి కొట్టేస్తే పేరుకి పేరూ డబ్బుకి డబ్బూ రెండూ వస్తాయి. ఆ ఆలోచనతో నవల త్వరత్వరగా పూర్తి చేసి పోటీకి పంపాడు. మళ్లీ అశేష పాఠకుల అదృష్టం పండటం చేత ఆ పోటీ న్యాయనిర్ణేతల్లో టీవీరావుకి తెలిసిన వ్యక్తి ఒకరున్నారు. ఆ ప్రకారంగా టీవీరావు ఎడమచేతి నవలకి ప్రథమ బహుమతి లభించింది. సూపర్ రచయిత టీవీరావు పేరు మోత మోగి పోయింది. ఆ శుభవార్త భార్యకి చెప్పాడు.

"ఇంకేం? ఈసారేం మాయమవుతుందో మరి?" అన్నది శ్రీమతి. టీవీరావు

గుండె జల్లుమంది. 'శకునపక్షి' అనుకున్నాడు మనస్సులో.

పట్టణంలో ఆనవాయితీ ప్రకారం సాహిత్యాన్ని కాక సాహిత్యకారుల్ని గౌరవించే సంస్థ ఒకటుంది. 'సాహితీ సమితి.' అది రచయితల్ని సన్మానిస్తూ తనని తాను సన్మానించుకుంటూ వుంటుంది. ఆ సంస్థ వాళ్లు ఏతత్ సందర్భంగా టీవీరావుని బ్రహ్మాండంగా సన్మానించడానికి ఏకగ్రీవ ముక్తకంఠ నిర్ణయం తీసుకున్నారు.. 'వేస్టుపేపర్' టీవీరావు ఏభయ్యో నవల కావడం ఆ వుత్సవానికి మరో ప్రత్యేకత. సాహిత్య సేవ తప్ప సన్మానాలు తనకి గిట్టవన్నాడు టీవీరావు ముందస్తుగా. అయితే సమితి వాళ్ల అభ్యర్థన తిరస్కరించడం మర్యాద కాదని 'అతి కష్టం మీద' అంగీకరించాడు.

ఆరోజు టీవీరావు అభిమానులు మర్చిపోలేని రోజు . టీవీరావు సన్మాన సభ భారీ ఎత్తున ప్రారంభమైంది. త్వరలో రిటైర్ కాబోయే హైకోర్టు న్యాయమూర్తి ఆ సభకి అధ్యక్షుడు. హోంమంత్రి గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. అధ్యక్షులవారు గంటసేపు ప్రసంగించారు. ఆయన టీవీరావు రాసిన ఒకానొక దయ్యం కథ మాత్రమే చదివారు. ఆ పునాది మీద నిలబడి టీవీరావు మాదిరిగా రచయతలంతా అశాస్త్రీయ శక్తుల గూర్చి శాస్త్రీయ పరిశోధన చెయ్యాల్సిన అవసరాన్ని నొక్కి వక్కాణించారు. ఒకానొక సందర్భంలో కోర్టులోకి సాక్షాత్తూ ఓ మోస్తరు దయ్యం ప్రవేశించి సాక్ష్యం చెప్పిన వైనం ఉటంకించి క్షుద్రశక్తులు లేవనే వాదనని నిర్దాక్షిణ్యంగా ఖండించారు. ఆ పిమ్మట హోం మంత్రిగారు ప్రసంగిస్తూ సాహిత్యంలో అభివృద్ధి కార్యక్రమాల గురించీ, కళారంగంలో శాంతి భద్రతల గురించీ అనర్గళంగా వుపన్యసించి టీవీరావు సాహితీసేవని అభినందించారు. పిమ్మట ఘనసన్మానం పొందిన టీవీరావు ఉచిత రీతిని ఈ విధంగా సమాధానమిచ్చాడు.

"మహాశయులారా! అభిమానులారా! ఇది చాలా సుదినం. ఇలా మీ అందర్నీ కలుసుకోవడానికే నేనీ సన్మానాని కంగీకరించాను. నిజానికి సన్మానాలంటే నాకు బొత్తిగా గిట్టవు. చిన్నతనం నుంచి ఇప్పటిదాకా కుడి ఎడమ చేతుల్తో అశేష ఆంధ్ర ప్రజానీకం కోసం రచనలు చేస్తున్నాను. నా రచనల్లో సామాజిక స్పృహ లేదని కొంతమంది అపోహపడుతున్నారు. నేను స్పృహ లేనివాణ్ణి కాదు. స్పృహ వుండటం చేతనే ఆరు నెలలు శ్రమించి 'వేస్ట్ పేపర్'ని సృష్టించగలిగాను, వేశ్యల బాధల గాథల్తో. అయితే అందులో మూడు నెలలు నా సుఖవ్యాధుల్ని నయం చేసుకోవడానికే పట్టిందని విమర్శకులంటున్నారు. వాళ్లపై జాలి పడాలి మనం. నాకు సుఖవ్యాధులు లేవు. రచయిత ఐనవాడికి మూడో కన్నుంటుంది. ఆ కన్నుతో అతను సామాజిక దృశ్యాల వెనక సత్యాన్ని చూడగలుగు..."

"ఓ సూపర్ రచయితా! నీ మూడోకన్నుతో ఈ సత్యని చూస్తావా?" హఠాత్తుగా ప్రేక్షకుల్లోంచి ఎవరో యువతి పైకిలేచి ప్రశ్నించింది.

టీవీరావు దిమ్మెరపోయాడు. అతని వాగ్ధార నోట్లోనే యింకి పోయింది. ప్రేక్షకులంతా ఆశ్చర్యంతో స్తంభించి పోయారు. ఇంతలో ఒక కార్యకర్త గబగబా ఆమె వద్దకు వచ్చి "ఎవరు

నువ్వ? నిశ్శబ్దంగా కూర్చోలేవూ?". అని గద్దించాడు. ఆమె భయపడలేదు.

"నేనెవర్నో ఆయన్నే అడగండి." అంది గంభీరంగా

"ఎవరో పిచ్చిది లాగుంది. మాట్లాడనియ్యకండి." అన్నాడు టీవీరావు కంగారుగా.

"నిజంగా పిచ్చిదాన్నే. లేకుంటే అభిమాన పాఠకురాలిగా నిన్నారాధించి నీ చేతుల్లో ఎందుకు మోసపోతాను? నాలాగా నీ మోజులో పడి మోస పోవద్దని ఈ జనాన్ని హెచ్చరించ డానికే యిలా వచ్చాను."

"నో! ఆమె మాటలు మీరు నమ్మొద్దు. పట్టిమోస గత్తెలాగుంది. ఎంత బరితెగించిందో చూడండి. చూస్తారేం? బయటకి గెంటించండి. ఇది నాకే గాదు, కళారంగానికే అవమానం."అంటూ పెద్దగా అరిచాడు టీవీరావు.

వెంటనే టీవీరావు అభిమాన కార్యకర్తల్లో ఉద్రేకం రేగింది. అందరూ కలిసి ఆమెని బలవంతంగా బయటికి ఈడ్చుకుపోయారు.

"ఓ పనికి మాలిన రచయితా? ఇంకెంత కాలం..." ఆమె అరుపులు మెల్లిగా దూరమయ్యాయి. సభలో కలకలం తగ్గి మళ్లీ శాంతి నెలకొన్నది. ఆ తర్వాత టీవీరావు అందుకని అదంతా తన ప్రత్యర్థి రచయితలు పన్నిన కుట్రలో భాగమని సవినయంగా విన్నవించాడు. అయితే అతని కంఠంలో వెనకటి వూపు లోపించింది.

ఏమైతేనేం టీవీరావు సన్మానసభ జయప్రదంగా ముగిసింది. టీవీరావు కించిత్తు డీలాపడి యిల్లు చేరు కున్నాడు. తన భార్య సభకి ససేమిరా రాకపోవడం ఒకందుకు మంచిదే అయ్యిందనుకున్నాడు. ఆ రాత్రి టీవీరావుకి నిద్రపట్టలేదు. తనకి జాతీయ బహుమతి వచ్చిన, సన్మానం పొందిన వుత్సాహం నీరైపోయింది. మనస్సులో ఏదో గిలి.

'ఇంతకీ ఆ సత్య ఎలా రాగలిగింది సభకి? ఎంతధైర్యం? ఇంకా మాట్లాడనిస్తే ఏమేం బయట పెట్టేదో? జనం ఏమనుకున్నారో? ఇంకా నయం. ఎవ్వరూ ఆమెని సమర్థించకముందే జాగ్రత్త పడి బయటికి పంపించాడు. కానీ ఆ మొదటి వరసలో మూర్తి? ఆమెని లాక్కువెళుతుంటే తనవైపు హేళనగా చూసినవ్వి ఆమెకి సహాయంగా వెళ్లాడు. ఎంత అవమానం? ఇక నుంచైనా తనలాంటి పేరున్న రచయిత జాగ్రత్తగా వుండాలి. తను పనికి మాలిన రచయితా?' ఇలాంటి ఆలోచన్లతో టీవీరావు తల దిమ్మెక్కి పోయింది. గోడ గడియారం రెండు గంటలు కొట్టి ఆగిపోయింది. హఠాత్తుగా మూడోగంట కొట్టినట్టు, కోటలో నగారా మోగినట్టు

"హాఆఆహాఛ్!"

టీవీరావు పెళేల్న తుమ్మాడు! ఒకే ఒక్క బీభత్స తుమ్ము. టీవీరావు కళ్లు గట్టిగా మూసుకున్నాడు. తక్షణం తలదిమ్ము మాయమైంది. మెదడంతా శ్మశానంలా శూన్యంగా మారిపోయింది. మనస్సులో గిలి అదృశ్యమై ముక్కు చివర జిలజిల ప్రారంభమైంది. భరించలేని దురద. జిలజిల. చిల చిల. గుల గుల. టీవీరావు తట్టుకోలేక ఎడమ అరచేత్తో

గట్టిగా ముక్కు రుద్దుకున్నాడు. అరచేతి నిండా బెత్తెడు మందాన తుప్పురాలింది. ముక్కు అరంగుళం మేర కుంచించుకు పోయింది. అంతులేని భయంతో టీవీరావు నిద్రమాత్రలు మింగి పడుకున్నాడు.

ఎప్పటిలా తెల్లారింది. ఎప్పటి లాగా టీవీరావు నిద్రలేచాడు. మంచం మీద మఠం వేసుక్కూర్చుని యధావిధిగా నోరు నెమలి పురిలా విప్పి ఆవలించాడు. ఆ వలించినట్టే అన్పించలేదు. ఆ నిద్ర మత్తుతోనే ఎడమచేత్తో జుట్టు సవరించుకున్నాడు. కానీ జుట్టు వున్నట్టే అన్పించలేదు. టీవీరావు ఎందుకో అనుమానంగా మళ్లీ అదే ఎడమ చేత్తో అదే జుట్టును అదే విధంగా సవరించుకున్నాడు. కానీ జుట్టు చేతికి తగల్లేదు. చెప్పలేని భయంతో తల తడుము కున్నాడు. కానీ జుట్టు కాదుగదా రాతి పలకలాంటి నుదురుగానీ, నుదురుకింద చిక్కుడు గింజల్లాంటి కళ్లుగానీ, కళ్లకింద వెదురు వాసం లాంటి ఏకైక ముక్కుగానీ, ముక్కుకింద నిండు సున్నలాంటి నోరుగానీ, నోరుకింద అడ్డం తిరిగిన అరసున్నలాంటి ఆ యొక్క గడ్డం గానీ ఏవీ చేతికి తగల్లేదు. ఆ మాటకొస్తే తలకాయే చేతికి తగల్లేదు.

టీవీరావు మంచం మీదనుంచి ఒక్కదూకు దూకి ఎదురుగా గోడకు గుద్దుకొని తడుముకుంటూ నిలువుటద్దం ముందు నిలబడి మొహం చూసుకున్నాడు. మొహం జాడే కన్పించలేదు. ఆమాకొస్తే అద్దమే కన్పించలేదు. 'పోయింది పోయింది' అని యిల్లంతా చిందులు తొక్కాడు. కిందపడి దొర్లాడు. ఉక్రోషంతో దుఃఖంతో నిస్సహాయంగా జుట్టుపీక్కోబోయాడు. మళ్లీ చేతికి జుట్టు తగల్లేదు! టీవీరావుకి పిచ్చెత్తి పోయింది. ఉన్నపళంగా వంటి మీద బట్టలు కూడా జారిపోగా నగ్నంగా పడుతూ లేస్తూ ఎలాగో డాక్టర్ కేవీరావు వద్దకి పరిగెత్తాడు.

★ ★ ★

"నో యంతమాత్రం వీల్లేదు. తలకాయ లేని కేసుల్ని నేను టేస్తే టేకప్ చెయ్యను."

*(అంకితమా? ఇంకెవరికి? నికొలయ్ గొగోల్ 'ముక్కు'కే!)*

*• ఉదయం వారపత్రిక, 15 ఫిబ్రవరి 91 •*

**రచన : 21.04.83**